క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలిసిన జెడ్పీ వైస్ చైర్మన్



కల్వకుర్తిరూరల్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆదివారం ఖమ్మం జిల్లా వైరాలో నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్‌తో పాటు పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు నియోజకవర్గ సమస్యలను వివరించారు.

ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌కు సన్మానం



కల్వకుర్తిరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా నియామకమైన మాజీ మంత్రి డాక్టర్ చిన్నారెడ్డిని మండలంలోని తోటపల్లి మాజీ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌రెడ్డి హైదరాబాద్‌లో చిన్నారెడ్డి గృహంలో శుభాకాంక్షలు తెలిపారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

కొల్లాపూర్: జర్నలిస్టులు దాడులను అరికట్టాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జర్నలిస్టు శంకర్‌పై దాడిని ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌లో పేదల భూములను బలవంతంగా లాక్కోవడాన్ని ప్రశ్నించినందుకే శంకర్‌పై దాడి చేశారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిలుక ప్రవీణ్‌పై కూడా దాడి చేశారని గుర్తు చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర కార్యదర్శిగా గణేష్‌మోడీ



అచ్చంపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన జర్పుల గణేష్‌మోడీని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్ ఆదివారం ప్రకటించి నియామక పత్రం అందజేశారు. గణేష్ మోడీ నియామకం పట్ల పలువురు హర్షం ప్రకటించారు.

నల్లమల చిన్నారుల ప్రతిభ

అచ్చంపేట రూరల్: స్మార్ట్ జీనియస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో నల్లమల ప్రాంతంలోని అచ్చంపేట కృష్ణవేణి టాలెంట్ స్కూల్ మూడో తరగతి విద్యార్థులు మణికంఠ, రక్షిత గ్లోబల్ లెవల్‌లో ప్రతిభ కనబర్చారు. ఆదివారం హైదాబాద్‌లోని రవీంద్రభారతిలో సంస్థ ప్రతినిధులు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ హరీష్ విద్యార్థులను అభినందించారు.


సీఐ, ఎస్‌ఐలకు సన్మానం



కల్వకుర్తిరూరల్: ఇటీవల కల్వకుర్తి నూతన సీఐగా నాగార్జున, ఎస్‌ఐగా మాధవరెడ్డిలు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో సీఐ, ఎస్‌ఐలను శాలువతో సత్కరించి పూలబొకేలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు రమేష్, కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి, కిషన్, తర్నికల్ శ్రీనివాస్, శ్రీనివాస్, వెంకటేష్, సత్యం, సురేందర్‌రెడ్డి, రమేష్, రవిగౌడ్, గణేష్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

తాడూరు: మండల కేంద్రంలో ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల ఎదుట యాదిరెడ్డిపల్లికి వెళ్లే రహదారి పక్కన గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు భయభ్రాంతులకు గురువుతున్నారు. రాత్రివేళలో గుంత కన్పించక పలువురు ప్రమాదాల బారిన పడ్డారని వాహనదారులు వాపోయారు. కేబుల్‌లైన్, వైఫైకోసం సంబంధిత అధికారులు గుంత తవ్వి పూడ్చకుండా వదిలేశారు. గుంతను అనుసరించుకుని రోడ్డును కట్ చేయడం వల్ల మరింత ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుంత పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు



మర్రిపల్లిలో చెరువు శిఖం భూమిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

ఉప్పునుంతల: గ్రామీణ యువతను క్రీడల్లో ప్రొత్సహించేందుకు గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు గ్రామాల్లో అనువుగా ఉన్న స్థలాలను గుర్తించి మైదానాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో పాఠశాలలు, ఆడేందుకు అనువుగా స్థలం లేకున్నా క్రీడా ప్రాంగణాల బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

అనువుగా లేని స్థలాల్లో క్రీడా మైదానాలు..

ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడంతో మండల స్థాయి అధికారులు చేసేదిలేక స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కొద్ది పాటి ఆట స్థలంలోనే క్రీడా ప్రాంగణాలుగా బోర్డులు ఏర్పాటు చేశారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలాలు ఎంపిక చేసి బోర్డులు మాత్రమే దర్శనం ఇస్తున్నాయి. ఆడేందుకు క్రీడాకారులు ఎవరు రావడం లేదు. దీంతో క్రీడాస్థలాలు



మొల్గర ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

నిరుపయోగంగా మారాయి. దాదాపుగా ఎక్కువ గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఆట స్థలాలనే క్రీడా ప్రాంగణాలుగా ఎంపిక చేశారు. మండలంలోని మర్రిపల్లిలో గ్రామ సమీపంలోని చెరువు శిఖం భూమిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతో చెరువు నిండితే క్రీడా ప్రాంగణం నీట మునిగిపోయే పరిస్థితి ఉంది. సీబీ తండాలో క్రీడా ప్రాంగణం బండరాళ్లు ఉన్నాయి. లక్ష్మాపూర్, సూర్య తండాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కొద్ది పాటి స్థలంలోనే క్రీడా ప్రాంగణాలుగా ఎంపిక చేశారు. ఉప్పునుంతల జెడ్పీహెచ్ఎస్, పెనిమిళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో ఉన్న ఆట స్థలాలనే చూపించారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయడానికి రూ. 1.29 కోట్లు మంజూరు కాగా ఇప్పటివరకు ఆయా గ్రామ పంచాయతీల్లో కేవలం రూ.7 లక్షలు మాత్రమే ఖర్చుచేశారు. కొరటికల్, మర్రిపల్లి, అయ్యవారిపల్లి, లత్తీపూర్ గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు ఏమాత్రం క్రీడా ప్రాంగణాల అభివృద్ధి పనులు మొదలుపెట్టలేదు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతోపాటు యువకులు ఆడుకోవడానికి క్రికెట్ కిట్లు, వాలీబాల్, డంబెల్స్ తదితర అన్ని రకాల ఆట వస్తువులు ప్రభుత్వ సరఫరా చేసింది. ప్రస్తుతం ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో క్రీడా వస్తువులు వృథాగా ఉన్నాయి.

స్థలాలు అందుబాటులో లేకనే..



గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల కోసం ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేవు. దీంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశాం. కొన్ని గ్రామాల్లో తప్పనిసరి పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న స్థలాలను ఎంపిక చేసి మట్టి, మొర్రం పోయించి ఆట స్థలాలను అభివృద్ధి చేస్తున్నాం. క్రీడా వస్తువులు గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉన్నాయి.

– లక్ష్మణ్‌రావు, ఎంపీడీఓ, ఉప్పునుంతల

మార్మోగిన గోవింద నామస్మరణ



దేవల్‌తిరుమలాపూర్ రథోత్సవానికి హాజరైన ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్



కోడేరులో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్‌లోని శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామిల రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పూజల చేసి రథంపై ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా గోవిందనామస్మరణతో మార్మోగింది. స్వామివారిని దర్శించుకొని భక్తిపారవశ్యంలో మునిగారు. ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. దేవాలయ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ సత్యం, విజ్జయ్య, శ్రీనివాసులు, పూజారి భవనాచార్యులు, ఆంజనేయులు, చంద్రయ్య, చిన్నయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రెండో రోజు స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు, మహాభిషేకం, అలంకారం, శ్రీదేవి, భూదేవి కల్యాణోత్సవం, మహామంగళహారతి, తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని అధికసంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ, భక్తులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్

కల్వకుర్తి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సన్నాహక సమావేశానికి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆధ్వర్యంలో కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని కొట్ర చౌరస్తాలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు సైదులు గౌడ్, తాహేర్ అలీతో పాటు కార్యకర్తలు ఉన్నారు.

వెల్దండ: అచ్చంపేటలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి వెళ్తున్న మాజీ మంత్రి కేటీఆర్‌కు మండలంలోని కొట్ర చౌరస్తాలో కార్యకర్తలు స్వాగతం పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చే వరకు ప్రజలకు అండగా ఉండి పోరాటం చేయాలని సూచించారు.



వెల్దండలో మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన నాయకులు

కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు యత్నం

అచ్చంపేట రూరల్: పట్టణంలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ను ఆదివారం మండలంలోని చెన్నారం గేటు సమీపంలో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకునేందుకు యత్నించారు. గో బ్యాక్ కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కార్యకర్తలకు ఫోన్ చేసి కాన్వాయ్‌ను అడ్డుకోవద్దని కార్యకర్తలను కోరారు. దీంతో వారు శాంతించారు. కాన్వాయ్ ఆ ప్రాంతానికి రాక ముందే కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

కాంగ్రెస్‌తోనే ముస్లింలకు సముచిత స్థానం

మన్ననూర్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ముస్లిం మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం లభిస్తుందని మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, ఎంపీటీసీ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. ముస్లింలకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయంటే అది కాంగ్రెస్ ఘనతే అన్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవిని ముస్లింలకు కేటాయించాలని త్వరలో సీఎంను కలుస్తామని ఆయన వివరించారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పంబలి బుచ్చయ్య, తుల్చానాయక్ నాయకులు వెంకటరమణ, సత్యనారాయణ, శివాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీటీసీలు రహీం, శ్రీనివాసులు

ఉమ్మడి పాలమూరుకు బీజేపీ చేసిందేమీ లేదు

కల్వకుర్తి: ఉమ్మడి పాలమూరు జిల్లాకు బీజేపీ చేసింది ఏమీ లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 10 సంవత్సరాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఒక్క ప్రాజెక్టు మంజూరు చేయలేదన్నారు. ఉన్నత చదువులు చదివి ఎంతోమంది కూలీలుగా మారుతున్నారని నిరుద్యోగ యువత వలస బాట పట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలోని బీజేపీ నాయకులు పదవుల కోసం జాతీయ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్నారు తప్పా అభివృద్ధి కోసం కృషి చేయలేదన్నారు. కాంగ్రెస్ నాయకులపై విమర్శలను మానకుంటే విజయసంకల్ప యాత్రను అడ్డుకుని తీరుతామని విజయ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు.

నేడు గద్దర్ సంస్మరణ సభ

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని పార్థసారథి ఫంక్షన్ హాల్‌లో సోమవారం ప్రజాకవి గద్దర్ సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గోపాల్, శేఖర్ మాదిగలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు గద్దర్ కుమార్తె వెన్నెల, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు.

వాల్ పోస్టర్లు విడుదల



లింగాల: మండలంలో ఈ నెల 27న బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయ సంకల్ప యాత్ర వాల్ పోస్టర్లలను మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అచ్చంపేట నియోజకవర్గం నాయకుడు జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అంబట్‌పల్లి నుంచి లింగాల వరకు యాత్ర కొనసాగుతుందని యాత్రలో కామారెడ్డి జాయింట్ కిల్లర్ కాటేపల్లి వెంకట రమణారెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మొక్తాల రేణయ్య, రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు బాలాజీ, మండల నాయకులు సలేశ్వర్యం, అశోక్, నవీన్, మహేష్, విష్ణు, శివ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కోడేరులో అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

కోడేరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని కుటుంబ, ఉద్యోగ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు తిరుపతిరెడ్డి, బాలస్వామి, మురళీమోహన్, శ్రీకాంత్, వెంకటేష్, పాపల్‌రాయుడు, శేషయ్యలను సన్మానించారు. ఖాదర్‌పాషా, ఖలీల్, ప్రదీప్, జగన్, ఖాజ, ఖాసీం, శివమ్మ, ప్రమీద, సింధుజ పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వనపర్తి, నాగర్‌కర్నూల్, పెబ్బేరు, అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మొత్తం మూడు వేల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జీఓ 317పై సబ్ కమిటీ ఏర్పాటుపై హర్షం

కందనూలు: గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండేళ్ల కిందట విడుదల చేసిన జీఓ 317పై ప్రస్తుత ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయడాన్ని పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం స్వాగతిస్తుందని సంఘ వ్యవస్థాపకులు హర్షవర్ధన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ అయ్యే అవకాశం ఉందని వివరించారు. త్వరలో ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎస్సీ హాస్టల్(బాలురు) విద్యార్థులకు భారత్ విద్యా ఉద్యమం ఆధ్వర్యంలో ఆదివారం వార్డెన్ మల్లేష్ అధ్యక్షతన ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా భారత్ విద్యా ఉద్యమం వ్యవస్థాపకుడు గాజుల వెంకటేష్ హాజరై విద్యా ప్రాముఖ్యతను, పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. ప్రణాళికా బద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పీయూ ప్రొఫెసర్ మధు, ఏఈ ఆంజనేయులు, రవీందర్, వెంకటేష్, నాసర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ మల్లురవికి కేటాయించాలి

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టికెట్‌ను మాజీ ఎంపీ మల్లు రవికి కేటాయించాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ కోరారు. ఆదివారం పెద్దకొత్తపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొడంగల్ సభలో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా గల్ల వంశీ చందర్‌రెడ్డిని ప్రకటించినట్లుగానే కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ మల్లురవిని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించాలని ఆయన కోరారు. అదేవిధంగా మల్లు రవికి ఎంపీ టికెట్ ఇవ్వాలని కొల్లాపూర్‌లో టీపీసీసీ నాయకుడు జగదీశ్వరుడు, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు రాముయాదవ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెలకపల్లిలో కాంగ్రెస్ మైనారిటీ మండల అధ్యక్షుడు కృషిద్, మన్ననూరులో డీసీసీ ఉపాధ్యక్షుడు పంబలి బుచ్చయ్యలు మల్లు రవికి ఎంపీ టికెట్ ఇవ్వాలని సీఎంకు, అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.



పెద్దకొత్తపల్లిలో మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



తాడూరులో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రోహిణి



నర్సాయిపల్లిలో

తాడూరు: మండల కేంద్రంలో ఆదివారం సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ రోహిణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా రాజేష్‌రెడ్డి గెలుపు అనంతరం మండల కేంద్రానికి సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.50 లక్షలు మంజూరు చేశారన్నారు. అభివృద్ధి పనులకు చేయూతనివ్వాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, రాములు, బాల్‌రాం, చంద్రయ్య, రామస్వామి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ.20 లక్షలు నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను సింగిల్ విండో చైర్మన్ మాజీ చైర్మన్ కొండల్‌రావు, శ్యామల, ఆంజనేయులు ప్రారంభించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నరహరిగౌడ్, బాలస్వామి, సాయిబాబు, చింతలయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



చారకొండలో ఆర్థిక సాయం అందిస్తున్న గౌడ సంఘం నాయకులు



తెలకపల్లిలో ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

తెలకపల్లి: మండలంలోని కార్వంగ గ్రామానికి చెందిన సామ శంకరయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. 2000 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.65,000 వేలు నగదు అందజేశారు.

చారకొండ: మండల కేంద్రానికి చెందిన జూలూరి లాలయ్య గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి గౌడ సంఘం నాయకులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంఘం ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అల్లాజి, నాయకులు బాలస్వామి గౌడ్, వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

కనులపండువగా రథోత్సవం

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రామగిరిలో వెలసిన సీతారామచంద్రస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం వేకువజామున నిర్వహించిన రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. రథాన్ని లాగేందుకు యువకులు పోటీపడ్డారు. కల్వకుర్తి, వంగూరు, ఉప్పునుంతల, తెలకపల్లి, నడిగడ్డ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎస్ఐ మాధవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



రథోత్సవానికి హాజరైన భక్తులు